ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 24 అక్టోబరు 2024



విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి

జూలపల్లి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో మాధవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, ఆయన మిత్రులు కలిసి సమకూర్చిన స్పోర్ట్స్ టీ షర్ట్‌ను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం తెలుకుంట కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని డీఈవో సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సరస్వతి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



ఓదెలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణరావు

ధాన్యంలో కోత విధిస్తే క్షమించేది లేదు..

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



రామగుండంలో రోడ్ల విస్తరణ ప్రారంభం

- ప్రతిపాదిత రహదారుల్లో మార్కింగ్
- దీపావళి తర్వాత ఊపందుకోనున్న పనులు
- టీయూఎఫ్ఐడీసీ నిధులతో టెండర్లు

కోల్‌సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వ్యాపార కేంద్రాల్లో ప్రతిపాదిత రోడ్ల విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా గోదావరిఖని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ పరిధిలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం మార్కింగ్ ఇచ్చింది. అజయ్ మెడికల్ స్టోర్ నుంచి బాలాజీ స్వీట్ హౌస్ మీదుగా పాపులర్ షూమార్ట్ వరకు 30అడుగులు, మార్కండేయ కాలనీ-లక్ష్మీనగర్‌లను కలిపే ప్రధాన లింకు రోడ్డు అయిన గణేష్‌నగర్ బోర్డు-లక్ష్మీనగర్ విజయ హాస్పిటల్ వరకు 30అడుగులు, రీగల్ షూమార్ట్-బాలాజీ స్వీట్ హౌస్ వరకు 40 అడుగులు, రీగల్ షూమార్ట్ నుంచి కళ్యాణ్‌నగర్ చౌరస్తా వరకు 40అడుగులు, ఓల్డ్ అశోక థియేటర్ నుంచి శక్తి ఎలక్ట్రికల్ మీదుగా సాయి జువెల్లర్స్ వరకు 30 అడుగులకు మార్కింగ్ ఇచ్చారు. ఇప్పటికే ఈ రహ దారులకు సంబం ధించి రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ అప్రువల్ కూడా ఉన్నాయి. సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తకుండా మొదటి దశలో కొన్ని రహదారులకు 30అడుగుల వరకే రోడ్ల విస్తరణకు మా ర్కింగ్ ఇచ్చారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం మున్సి పాలిటీలు, కార్పొరేషన్లలో కార్పొరేషన్‌లలో 30అడుగుల రహదారి తప్పనిసరి. వ్యాపార కేంద్రాల్లో 11అడుగులు, 14 అడుగులు, 15అడుగులు మాత్రమే రహదారులు ఉన్నాయి. దీంతో పలు రహదారుల్లో టు వీలర్స్ వెళ్లకుండా కూడా కష్టంగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో రోడ్ల వెడల్పు ద్వారా వ్యాపార కేంద్రాల్లో కొత్త వ్యాపారాలను నిర్వహించేలా చూడా లని నిర్ణయించారు. విజయ పిల్లల హాస్పిటల్ నుంచి గణేష్ నగర్ బోర్డు వరకు ప్రతిపాదించిన రహదారికి ప్రజలు మార్కింగ్ మేరకు స్వచ్ఛందంగా తొలగింపు కార్యక్రమం చేపట్టారు. 9వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ గణేష్‌నగర్ బోర్డు ప్రాంతంలోని తన భవనానికి మార్కింగ్ మేరకు తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. దీంతో పలువురు స్వచ్ఛంద తొలగింపులకు ముందుకు వస్తున్నారు. ఒకేరోజు పది మంది స్వచ్ఛందంగా తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. లక్ష్మీనగర్‌లో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ క్యాన శ్రీనివాస్ ఈ రహదారి విస్తరణకు తాను పూర్తిగా సహకరిస్తామంటూ ప్రకటించారు. తన భవనాన్ని సైతం మార్కింగ్ మేరకు తొలగించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. లక్ష్మీనగర్, మార్కండేయకాలనీ రెండు వ్యాపార కేంద్రాలను లింకు చేయడంలో కీలకమైన ఈ రహదారి విస్తరణ జరిగితే ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అజయ్ మెడికల్ స్టోర్-పాపులర్ షూమార్ట్ రహదారి విస్తరణ గతంలోను ప్రతిపాదించారు. ఆర్‌డీపీ ఆమోదం కూడా జరిగింది. ఈ రహదారి విస్తరణ జరిగితే



మార్కింగ్ ప్రకారం భవనాన్ని తొలగించుకుంటున్న యజమాని

మిగతా 8వ పేజీలో...

ప్రజలు నేరుగా కలిసేందుకు రోజుకు 2 గంటలు..

- పారదర్శక పాలన అందించడమే ధ్యేయం
- పెద్దపల్లి జిల్లా ప్రజలు చైతన్యవంతులు..
- ధరణి సమస్యలు ఎప్పటికప్పుడే పరిష్కారం
- ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూస్తాం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు
- ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ చేస్తున్నాం
- నాపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

'వివిధ సమస్యలపై ప్రజలు నన్ను కలిసేందుకు ప్రతి రోజు రెండు గంటలపాటు అవకాశం కల్పించాను.. పెద్దపల్లి జిల్లా ప్రజలు చైతన్యవంతులు.. పారదర్శక పాలన అందించడమే ధ్యేయంగా పని చేస్తాను.. క్షేత్రస్థాయి పర్యటనకు ముందస్తుగానే షెడ్యూల్ ఖరారు చేస్తాను.. ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు యత్నిస్తున్నాం.. ఆసుపత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నాం.. 10 నుంచి 14 కోట్లతో వివిధ యంత్ర పరికరాలను కొనుగోలు చేస్తున్నాం.. రామగుండం మెడికల్ కళాశాలలో పీజీ కోర్సులు మంజూరుచేయాలని మెడికల్ కౌన్సిల్‌కు రాశాం.. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పూర్తి చేస్తున్నాం.. ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశాం.. సన్న ధాన్యాన్ని గుర్తించేందుకు కాలీపర్స్ పరికరాలను తెప్పిస్తున్నాం.. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు విషయమై నాపై రాజకీయ ఒత్తిళ్లు ఏమిలేవు. అందరిని సమన్వయం చేసుకుని జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకవెళతాం..'కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ధరణి సమస్యలు చాలానే ఉన్నాయి కదా!

కలెక్టర్ : ధరణి సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం లేదు. ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకు 45,682 దరఖాస్తులు రాగా, అందులో 28,782 దరఖాస్తులను పరిష్కరించి 16,900 తిరస్కరించారు. ప్రస్తుతం తహసీల్దార్, ఆర్‌డీవో, అదనపుకలెక్టర్, తన లాగిన్‌లో 514 దరఖాస్తులు పరిష్కరించాం. పోర్టల్ వచ్చే ఆప్షన్స్‌ను బట్టి వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. ధరణి సమస్యలపై ప్రజావాణికి వచ్చే వారి సంఖ్య తగ్గింది.

మిగతా 8వ పేజీలో...

లయన్స్‌క్లబ్ చేయూత...

మార్కండేయకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం లయన్స్‌క్లబ్ శ్రీకారం ఆధ్వర్యంలో బుధవారం సుమతి అనే నిరుపేద మహిళ కుటుంబానికి రూ.8వేల ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుమతికి చికిత్స నిమిత్తం ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కే మంజు, వైస్ ప్రెసిడెంట్ రజిత, సోమారపు లావణ్య, వారిజ, సాయిలీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి..

- గ్రంథాయల సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాయల సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయగౌడ్ అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరుశురాములుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అన్నయ్యగౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని, ప్రభుత్వ పరంగా వారికి పథకాలు వర్తింపజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపగాని సారయ్యగౌడ్, పడాల కొమురయ్యగౌడ్, ముత్యం శంకరయ్య, కోల లక్ష్మణ్, తిరుపతి, బూరుగు రాజేశంగౌడ్, వేగోళం శంకర్‌గౌడ్, భైరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : న్యాయపరమైనా చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి స్వప్న రాణి అన్నారు. బుధవారం మండలంలోని నిట్టూరులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉన్నట్లయితే సమాజంలో నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు, న్యాయవాదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం జరిపిస్తాం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి విద్యార్థులకు న్యాయం చేస్తామని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శివంగారి సతీష్ పేర్కొన్నారు. కలెక్టరెట్‌ను బుధవారం ముట్టడించిన అనంతరం సతీష్ మాట్లాడారు. పెండింగులో ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలరుషిప్పులు చెల్లించే వరకు ఆందోళనలు చేపడుతామన్నారు. అనంతరం కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, అభినయ్, రామగిరి అఖిల్, నరేష్, జంగా చక్రధర్ రెడ్డి, క్రాంతి, సందీప్, కృష్ణ, సంతోష్, విజయ్, వెంకటేష్, ఆకాష్, రిషికేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపాధిహామీ పనుల పురోగతిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న జాబ్ కార్డు కుటుంబాలు తక్కువగా నమోదు అవుతున్నాయని, ప్రస్తుత సంవత్సరం కేవలం 360 మాత్రమే జరిగాయన్నారు. మన పనితీరు చాలా తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో గత సంవత్సరం కంటే కనీసం 40శాతం అధికంగా కుటుంబాలకు 100 రోజుల పని ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి కల్పించాలని, దానికి తగిన విధంగా పనులను గుర్తించి గ్రామ సభలను వెంటనే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మన గ్రామంలో సరాసరి వేజ్ 181 కంటే తక్కువ వచ్చే పనులు చేపట్టవద్దన్నారు. గ్రామంలో 4,5 లోకేషన్లలో క్వాలిటీ పనులు జరగాలని, ఈ పనులు 100 రోజుల వరకు వండే విధంగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరం కంటే సరాసరి వేతనం కనీసం 20 శాతం పెంచడం లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ కె రవీందర్, జడ్పీసీఈవో నరేందర్, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాభిప్రాయ కార్యక్రమాల నిర్వహణకు పక్కా చర్యలు

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

సమగ్ర కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టిన ప్రజాభిప్రాయ కార్యక్రమాల నిర్వహణకు పక్కా చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ కమిషనర్ బాల మాయదేవితో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ జరపాలని ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర కులాల సర్వే చేపట్టిందని అన్నారు. కులగణన కేంద్రం పరిధిలో ఉందని తెలిపారు. బీసీలే కాకుండా మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ మొదలగు అన్ని కులాల సమగ్ర వివరాలు సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కమిషన్ పర్యటనకు సంబంధించిన వివరాలు విస్తృతంగా ప్రచారం కల్పించాలని, కమిషన్ పర్యటించే ప్రాంతం, ప్రజాభిప్రాయ సేకరణ ఎక్కడ జరుగుతుందనే వివరాలు, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ జిల్లా ప్రజలు ఏ సమయంలో రావాలి షెడ్యూల్ నిర్ధారించి ఆ వివరాలు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మీడియా ద్వారా ప్రచారం చేయాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు సంబంధించి నవంబర్ 1న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఈ కార్యక్రమానికి పెద్దపల్లి నుంచి అన్ని కుల సంఘాలు, వర్గాల ప్రజలు, సంచార జాతుల వారు హాజరయ్యే విధంగా విస్తృతంగా ప్రచారం కల్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో గ్యార్మీ షరీఫ్



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం గ్యార్మీ షరీఫ్ జెండా పండుగ నిర్వహించారు. సీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి సీపీ, పోలీస్ అధికారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఏటా గ్యార్మీ పండుగను ముస్లింలు సంతోషంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ప్రతిఒక్కరూ మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఫైవింక్లయిన్‌లోని మదర్సా పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. పిల్లలకు తీపి భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్)సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, మల్లేషం, శ్రీనివాస్, సంపత్, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

కాలేజీలో నూతన గదుల నిర్మాణం కోసం పరిశీలన

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన తరగతి గదుల నిర్మాణ కోసం సంబంధిత అధికారులు కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల కళాశాలలో గత కొన్నేళ్లుగా గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ విన్నపం మేరకు గదుల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్డీఎఫ్ 2 కోట్ల రూపాయల నిధులతో గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత అధికారులతో పర్యవేక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. పాత బిల్డింగ్ ను తొలగించి నూతన గదులు నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ల స్వరూప, నూగి శ్రీ మల్లయ్య, భూతగడ్డ సంపత్ ఎల్ రాజయ్య, సయ్యద్ మస్రత్, అస్లాం తదితరులున్నారు.



క్రైం కార్నర్

ఆస్తి తగదాలతో అన్నను చంపిన తమ్ముళ్లు

- ముగ్గురు నిందితుల అరెస్ట్


మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న ఆస్తి తగదాలను మనసులో పెట్టుకుని సొంత అన్న అని చూడకుండా హత్య చేశారు ఇద్దరు తమ్ముళ్లు. మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఈ నెల 20న పల్లపు సాయిలు(36)ను హత్య చేసిన ముగ్గురు నిందితులను బుధవారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని తమ్ముళ్ల పల్లపు చందు, పల్లపు చిన్నితో పాటు గొల్ల సోయమ్మ అనే వారితో పల్లపు సాయిలుకు గత కొద్ది రోజులుగా భూ వివాదంతో పాటు ఇంటి స్థలం విషయంలో కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో వ్యవహా రం ఎటు తెగకపోవడంతో కక్ష పెట్టుకున్న తమ్ముళ్లు మృతుడు పల్లపు సాయిలును ఎలాగైనా హత్య చేయాలని పథకం వేసారు. దీంతో పల్లపు సాయిలు ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసి గొల్ల సోమయ్య, చందు, చిన్ని స్థానిక గోదావరి బ్రిడ్జి వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. అనంతరం గొడవపడి సాయిలును నెట్టివేయగా కిందపడిపోయాడు. వారి వెంట తెచ్చుకున్న తల్వార్‌తో మెడపై బలంగా నరికి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. అనంతరం ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. మృతుని భార్య నవ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మల్లాపూర్ శివారులోని కనకసోమేశ్వర గుడి వద్ద ఉన్నారనే సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన తల్వారును స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, కిరణ్‌కుమార్, రాజులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుని ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన వెయిటర్ బనమాలి మాతాన్(54) లిఫ్ట్‌లో ఇరుక్కుని మృతి చెందాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. ముకరంపుర ప్రాంతానికి చెందిన ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న మాతాన్ తాను నివాసం ఉంటున్న భవనంలో మొదటి అంతస్తు నుంచి పెంట్‌హౌస్‌కు వెళ్లే క్రమంలో లిఫ్ట్ హఠాత్తుగా కిందికి వెళ్ళడంతో అందులో ఇరుక్కున్నాడు. తీవ్రంగా గాయపడిన మాతాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లిఫ్ట్ సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డుపై వేసిన బోరు సీజ్

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ పరిధిలోని పద్మశాలివీధికి చెందిన మహేందర్ అనే వ్యక్తి నడిరోడ్డుపై వేసిన బోరు వేయడంతో, సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్లపైన బోర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డుపై బోరు వేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిపిఓ శ్రీధర్, ఏఈ నరేష్, టిపిఎస్ ప్రదీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడనిపై బుధవారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఫేస్‌బుక్‌లో తనకు పరిచయం అయిన సదరు మహిళ తనను ఉద్దేశ్యపూర్వకంగా డబ్బులు డిమాండ్ చేసిందని, ఇవ్వకుంటనే అత్యాచారం కేసు పెడుతానని బెదిరించిందని రాజేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామ శివారులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల మల్లయ్య తన వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా, లింగాపూర్-చింతలపల్లి గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మల్లయ్య కాలు విరిగింది. గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించడంతో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యకు కారణమైన ఒకరి రిమాండ్

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు కారణమైన సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కేశవపట్నం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన సుంకరి చందర్ తండ్రి సారయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో ఒక ఎకరం భూమిని అవసర నిమిత్తం అదే గ్రామానికి చెందిన పేరుమడ్ల రాజబాబుకు అమ్మాడు. రాజబాబు అక్రమంగా ఎకరం భూమికి బదులు మూడెకరాల భూమిని పట్టా చేయించుకున్నాడు. ఈ విషయం చందర్ తండ్రి సారయ్యకు తెలిసి వీరి మధ్య పలుమార్లు పంచాయతీ జరిగింది. అప్పటికి కూడా భూమిని తిరిగి తన తండ్రి సారయ్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తన తండ్రి తీవ్ర మనస్తాపం చెంది కేశవపట్నం పొలిమెరలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో సుంకరి చందర్ కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి పేరుమడ్ల రాజబాబును రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పేదరికంతో బిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు

- తిరిగి ఇప్పించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరికం ఆ తల్లిదండ్రులు బిడ్డను అమ్ముకునేలా చేసింది. తొలుత విక్రయించినా తిరిగి తమ బిడ్డను తమకు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన శ్యామల, రవీందర్ దంపతులు 15 సంవత్సరాలుగా రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. దంపతులకు ఐదుగురు ఆడ పిల్లలు సంతానం. పేదరికంతో పిల్లలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్న పాపను విక్రయించాలని నిర్ణయించుకున్నారు. తమకు పరిచయమున్న జగిత్యాల జిల్లా గోవిందులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మికి తమ పాపను అమ్ముతామని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో మంగళవారం తల్లిదండ్రులు ఇద్దరు లక్ష్మికి పాపను విక్రయించి కాగితం రాసుకున్నారు. బుధవారం శ్యామల తమ పాపను తిరిగి ఇప్పించాలని వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు లక్ష్మిని విచారించగా రూ.90 వేలకు పాపను తనకు విక్రయించారని తెలిపింది. అనంతరం పాపను పోలీసులు శ్యామలకు అప్పగించారు.

సామాజిక వేణుగోపాల్

- ప్రకృతి... జంతువుల ప్రేమికుడు...
- రోడ్డుపై గుంతలు ఏర్పడితే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ప్లాస్టిక్ అనర్థాలపై సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం
- హుజూరాబాద్‌లో 'నలుబాల'కు ప్రత్యేక గుర్తింపు

రోడ్డుపై గుంతలు పడ్డాయా.. నలుబాల వేణుగోపాల్ అక్కడికి వస్తాడు. ఎర్ర జెండా ఏర్పాటు చేసి వాహనదారులను దారి మళ్లిస్తాడు.. ఏవైనా జంతువులు చనిపోయాయా.. వేణుగోపాల్ అక్కడికి వచ్చి వాటి కళేబరాలను అక్కడి నుంచి పట్టణానికి దూరంగా తీసుకెళ్లి పూడ్చిపెడతాడు.. ఇలా 25 ఏళ్లుగా హుజూరాబాద్‌లో సామాజిక కార్యక్రమాలకు చిరునామాగా మారారు నలుబాల వేణుగోపాల్. వృతి రీత్యా ఆర్కిటెక్ట్ అయిన వేణుగోపాల్ సామాజిక రుగ్మతలపై యుద్ధం చేస్తున్నాడు. ఆయన వాహనంపై 108 అని రాసుకున్నాడు. ఇలా ఎందుకు అని అడిగితే ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను 108లా అక్కడి వచ్చి సహాయం చేస్తానని చెబుతాడు.

ఆదర్శం



ప్లాస్టిక్ సంచులు వాడవద్దంటూ సైకిల్‌పై తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయన ప్రకృతి.. జంతువుల ప్రేమికుడు... రోడ్లపై గుంతలు పడితే సమస్య పరిష్కరించేంత వరకు హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు అధికారులను పిలిపించి మరమ్మతులు చేయిస్తాడు. ప్లాస్టిక్ సంచులు వాడవద్దని కూరగాయాల మార్కెట్‌కు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. సామాజిక కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు హుజూరాబాద్‌కు చెందిన నలుబాల వేణుగోపాల్. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆర్కిటెక్ట్ వేణుగోపాల్ వృతిరీత్యా భవనాలకు ప్లానింగ్ చేస్తూ సివిల్ ఇంజినీర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. సామాజిక రుగ్మతలను నిర్మూలిస్తూ ఒక సైన్యంలా పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. రోడ్డు పక్కన కోతులు, కుక్కలు, పందులు చనిపోయి ఉంటే వాటిన తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడం ఆయనకు అలవాటు. కోతులు, కుక్కలతో స్నేహం పెంచుకొని వాటికి ఆహారాన్ని అందిస్తారు. ఎవరైనా అనాథలుగా చనిపోతే వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తాడు. రోడ్లపై గుంతలు పడితే అక్కడ ఎర్ర జెండాతో వాలిపోయి వాహనదారులను దారి మళ్లిస్తాడు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని కూరగాయల మార్కెట్‌కు వెళ్లి బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు నాటాలని సైకిల్‌పై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మొక్కలు నాటుతారు. రోడ్లపై చెత్త ఉంటే స్వచ్ఛభారత్‌లో భాగంగా శుభ్రం చేస్తాడు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేస్తాడు. ప్రభుత్వాధికారుల పనితీరును, సంక్షేమ పథకాలల్లో అవినీతి అక్రమాలను ప్రశ్నించడం ఈయన నైజం. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వేణుగోపాల్ కలెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పలు అవార్డులు అందుకున్నారు.

● ఆయన ఒక 108...

వేణుగోపాల్ ద్విచక్ర వాహనానికి 108 అని రాసి ఉంటుంది. ఆయనకు ఎవరైనా ఫోన్ చేసి ఇక్కడ ఒక సమస్య ఉందంటే వెంటనే వాలిపోతారు. షోవోలిన్, కుంగ్‌ఫూ, కరాటేలో జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ఆయన 25ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచు కుంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో పారిశుధ్యం అమలు కాకుంటే ఎప్పటికప్పుడు అధికారులను అప్ర మత్తం చేస్తుంటాడు. ఆస్పత్రుల్లో పేద రోగులకు ఉచితం గా మందులు పంపిణీ చేస్తూ వారి యోగక్షేమాలను చూసుకుంటారు. చేతనైనంత సాయం చేయడంలో అసలైన తృప్తి ఉందని అందుకే ఇవన్నీ చేసున్నానని, ఎవరేమనుకున్నా తనకు సంబంధం లేదని ఎప్పుడు చెబుతుంటాడు.


హుజూరాబాద్‌లో మొక్కలు నాటుతున్న నలుబాల వేణుగోపాల్

● విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు చేయాలనే ఆలోచన

విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. 25 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాను. సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశ్యంతో వివిధ కార్యక్రమాలు చేస్తున్నాను. ఇక ముందూ చేస్తూ ఉంటాను. నా సంపాదనలో కొంత మేర ప్రజలకు ఉపయోగిస్తాను.

- నలుబాల వేణుగోపాల్, సామాజిక కార్యకర్త, హుజూరాబాద్



అదుపు తప్పిన వాహనాలు

- రోడ్డు పక్క, షెడ్, దుకాణాల్లోకి దూసుకుపోయిన కంటైనర్, కారు
- ఆస్తి నష్టం... పోలీసులకు ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23: రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు అదుపుతప్పి పక్కన దుకాణాలు, టీ కొట్టుల్లోకి దూసుకుపోతున్నాయి. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపటం మూలంగానే ఈ ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. 12 గంటల వ్యవధిలో కరీంనగర్‌లో రెండు సంఘటనలు చోటుచేసుకోగా అదృష్టవశ్తు ఎవరూ గాయపడనప్పటికీ ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివానగర్ వ్యాన్‌ల అడ్డా వద్ద ఒక భారీ కంటైనర్ పద్మనగర్ వైపు నుంచి బైపాస్‌రోడ్ గుండా విశాఖపట్నంకు వెళుతూ రోడ్డు పక్కన టీ షాపు షెడ్‌లోకి దూసుకుపోయింది. దీంతో షెడ్ కూలిపోగా, అందులోని ఫర్నిచర్, బైక్, కారు ధ్వంసమయ్యాయి. సుమారు 3.5 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని టీ షాపు యజమాని నర్సయ్య రెండో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కంటైనర్ డ్రైవర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సంఘటనా స్థలంలో వీధిదీపాలు లేకపోవటంతో పాటు చీకట్లో డ్రైవర్ మత్తులో ఉండి అతివేగంగా నడపటంతో అదుపుతప్పి షెడ్‌ను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. బుధవారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో తిరుమల్‌నగర్‌లో అంబేద్కర్ స్టేడియం చౌరస్తాలో ఒక కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కిరాణంషాపులోకి దూసుకుపోయింది. షాపులోని వస్తువులు కొన్ని ధ్వంసమై నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. ఎదురుగా స్కూల్ వ్యాన్ వస్తుండగా తప్పించబోగా అదుపుతప్పి కిరాణం షాపులోకి దూసుకుపోయిందని తెలిపారు. కారును నడుపుతున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.


షెడ్‌ను ఢీకొట్టిన కంటైనర్


ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

చందుర్తి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ విషయంలో మహిళపై దాడికి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జగట్టు వసంతతో బొజ్జగట్టు మోహన్‌కు ఇంటి పక్కన భూమి విషయంలో గొడవలు జరిగాయి. 16 ఆగస్టు 2014న వసంత ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా మోహన్ గోడ నిర్మిస్తుండగా అడ్డుకున్న వసంతను దూషించడంతోపాటు కొట్టాడు. ఈ మేరకు బాధితురాలు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మోహన్‌కు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రైస్ మిల్లుల కేంద్రంగా మానకొండూర్

● వివిధ రాష్ట్రాల కూలీలకు ఉపాధి

మానకొండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఉమ్మడి జిల్లా వ్యవసాయ ముఖ చిత్రాన్ని మార్చింది. ఎస్సారెస్పీ నీటితో భూములన్నీ సస్యశ్యామలమయ్యాయి. మానకొండూర్ ప్రాంతంలో వరి సాగు పెద్ద ఎత్తున్న పెరిగింది. ఇక్కడి నుంచి రోడ్డు సౌకర్యం ఉండడంతో మానకొండూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రైస్‌మిల్లులు వెలిశాయి. 40ఏళ్ల క్రితం మొట్టమొదటి రైస్ మిల్లును ఇక్కడ ఏర్పాటు చేశారు. మిల్లుల ఏర్పాటుతో స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి లభించింది. క్రమక్రమంగా రైస్ మిల్లుల సంఖ్య పెరగడంతో ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు ఉపాధి కోసం రావడం ప్రారంభమైంది. మానకొండూర్, సదాశివపల్లి గ్రామాల్లో 40కిపైగా రైసుమిల్లులు కొనసాగుతున్నాయి. దాదాపు 1200 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు వరి ధాన్యం సేకరించి ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ అందిస్తూ ఉమ్మడి జిల్లాలో మానకొండూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారికి పక్కన ఉన్న రైసు మిల్లులు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. మిల్ ఆపరేటర్లు, మెకానిక్‌లు, లారీ డ్రైవర్లు కూలీలు ఇలా పలు రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. పొట్ట చేతపట్టుకొని వందల కిలోమీటర్ల నుంచి జీవనోపాధి కోసం భార్యాపిల్లలతో వచ్చిన కూలీలకు మిల్లుల యజమానులు వసతి కల్పిస్తున్నారు. ఒకప్పుడు రైస్ మిల్లులతోనే గుర్తింపు పొందిన ఈ ప్రాంతంలో ఇతర వ్యాపారాలూ ఊపందుకున్నాయి.


మానకొండూర్‌లో కూలీలకు ఉపాధి కల్పిస్తున్న రైసుమిల్లు

న్యూస్ బాక్స్

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శ్రీరాములు నియామకం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గోసికొండ శ్రీరాములు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఎంపిక య్యారు. ఈ మేరకు యూనివర్సిటీలో విభాగాధిపతి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. పోస్టుకు ఎంపిక కావడంపై స్థానికులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు ఆసక్తి అర్హత కలిగిన వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అధికారుల దాడులు

గంగాధర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరగ్గాలపై రంగుల వస్త్రాలు తయారు చేస్తున్న లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. చెన్నయ్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, జిల్లా జౌళిశాఖ అధికారులు దాడిలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఓల్లెపు మొగిలి ఇంట్లో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం పట్టుకున్నారు. అక్రమంగా నిలువ ఉంచిన బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్లో మొగిలిపై సివిల్ సప్లై అధికారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రదే శాలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసుల సహాయంతో సివిల్ సప్లై అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు ఈ మేరకు మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23: సిరిసిల్ల పట్టణంలో రగుడు బైపాస్ రహదారిపై బుధవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. మెదక్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ కుటుంబ సభ్యులతో వేములవాడలో పెళ్లి చూపులకు కోసం బయలుదేరారు. సిరిసిల్ల పట్టణం చంద్రంపేట బైపాస్ తర్వాత రగుడు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆ మార్గంలో రహదారిపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రూట్ మార్చుకొని వన్‌వేలో వెళ్తుండగా యూటర్న్ చేసుకొని అతివేగంగా వస్తున్న చందుర్తి మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన మరో కారు ఎదుగా ఢీకొంది. దీంతో మహ్మద్ గౌస్ కారు అదుపు తప్పి ఎగిరి కల్వర్టు కిందపడింది. అందులో ప్రయాణిస్తున్న ఎమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. మరో కారు డి వైడర్‌కు ఢీకొట్టి ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను స్థానికులు కారు నుంచి బయటకు తీసి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దసరా పండుగ రోజున ఇదే మార్గంలో చంద్రంపేటకు చెందిన వేముల శేఖర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైపాస్ రహదారిపై ధాన్యం ఆరబోయడం, కల్వర్టు నిర్మాణంలో ఉండడం, రోడ్డుపై అక్కడక్కడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, ఆక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. ఎలిగేడు మండలంలోని నారాయణ రావుపల్లి గ్రామానికి చెందిన కరివేద రవీందర్‌రెడ్డి(38) అనే యువకుడు కరీంనగర్ నుంచి రాత్రి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాంగ్ రూట్లో ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌రెడ్డి సంఘటన స్థలంలోనే మృతిచెందాడరని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం అనంతరం మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు కరీంనగరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడని, ప్రతీ రోజు స్వగ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటాడని తెలిసింది.

ఎన్టీపీసీలో ఒకరి దుర్మరణం

జ్యోతినగర్, అక్టోబరు 23: ఎన్టీపీసీ బీ టైపు గేటు సమీప రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహ్మద్ ఖలీం(38) అనే దివ్యాంగుడు మృతిచెందాడు. గోదావరిఖని నుంచి తన స్కూటీపై రామగుండం వైపు వెళ్తున్నాడు. ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపై ఆపడంతో వెనుకనే వస్తున్న ఖలీం వాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా చనిపోయాడు. ఖలీం స్వగ్రామం పెద్దపల్లి మండలం హన్మంతునిపేట. గోదావరిఖనిలోని మైనార్టీ గురుకులంలో ఔట్ సోర్సింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని హన్మంతునిపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వేములవాడ మండలం అనుపురంలోని ప్రధాన రహదారిని ఆనుకొని చెట్ల పొదల్లో సుమారు 50 సంవత్సరాల వయస్సుగల పురుషుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసినకరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశం, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ మణిదీప్తి, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, చిలుక సతీష్, జానీ, చిన్నయ్య, గుజ్జేటి వెంకన్న, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానేరు వంతెన రెండు జిల్లాలకు వరం లాంటిది

ఓదెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రూపునారాయణపేట మానేరువాగుపై వంతెన సౌకర్యం పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు వరం లాంటిదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం రూపునారాయణపేట సమీపంలోని మానేరు వాగుపై మంజూరైన వంతెన నిర్మాణ ప్రాంతాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, జేఈలతో కలిసి సందర్శించారు. ఓదెల మండలం రూపునారాయణపేట, మానేరు వాగు నుంచి జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మీదుగా నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించి అంచనా వ్యయాన్ని సమీక్షించారు. గ్రామాల్లో వెడల్పు, వంతెన పొడవులపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణమైతే రైతులకు జమ్మికుంటలోని మార్కెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం రూ. 80 కోట్లు కేటాయించగా, అదనంగా ఎన్ని కోట్ల నిధులైనా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతకుముందు గుంపుల నుంచి జమ్మికుంట వైపు వెళ్లే ప్రధాన రహదారి ధ్వంసం కావడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, అంకం రమేష్, బోడకుంట స్వామి, బొంగోని శ్రీనివాస్, ఆకుల మహేందర్, పడాల రాజు, సిరిసేటి రాహుల్, రెడ్డి రజనీకాంత్, కోట నిరంజన్ రెడ్డి, నీర్ల శ్రీనివాస్, చింతం కుమారస్వామి, నాగపూరి రవి గౌడ్, చీకట్ల ముండయ్య, సంద మహేందర్, తిప్పారపు సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో 150 మంది విద్యార్థులు



బస్సులో విద్యార్థులు

మల్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గల నూకపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో వందలాదిగా ఇబ్బందుల మధ్య ప్రయాణిస్తున్నారు. ఈ స్కూల్‌కు మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాదిగా విద్యార్థులు వస్తూంటారు. అయితే వీరందరి కోసం జగిత్యాల డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఒక్కో ట్రిప్ ద్వారా విద్యార్థులను స్కూల్‌కు చేరవేస్తుంటాయి. అయితే బస్సులో 60 మంది లోపే ప్రయాణించే అవకాశం ఉండగా నిత్యం 150 మందికి పైగా విద్యార్థులు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. బుధవారం బస్ పాస్ లేని వారే 140 మంది ఉన్నట్లు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రెండు బస్సులను రెండు ట్రిప్పుల చొప్పున నడుపాలని కోరుతున్నారు

నయా ట్రెండ్..



మల్కాపూర్‌లోని ఫాంహౌస్‌లో స్విమ్మింగ్‌పూల్ లోపలి భాగం

"ప్రస్తుతం ఫంక్షన్ల నిర్వహణలో కొత్త ట్రెండ్ నడుస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం ఫాంహౌస్ కల్చర్ నడుస్తోంది. గెట్‌టు గెదర్‌లు మొదలుకొని హల్దీ, సంగీత్ ఇలా రకరకాల ఫంక్షన్లను ఫాంహౌస్‌ల్లో నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. ఈ ఫాంహౌలక్ష రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, స్విమ్మింగ్ పూల్, ఓపెన్ కిచెన్, నైట్ ఫైర్, ఫొటో షూట్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో ఫంక్షన్లు చేసుకునే అవకాశం ఉంది. నిర్వాహకులు అందుబాటు ధరల్లో అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఫాంహౌస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు."

- ఫాంహౌస్‌ల్లో ఫంక్షన్లు
- కరీంనగర్‌లో పదుల సంఖ్యలో ఏర్పాటు
- స్విమ్మింగ్‌పూల్‌లు, రెయిన్ డ్యాన్స్‌లతో అధునాతన సౌకర్యాలు

భగత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫాంహౌస్ కల్చర్ రోజురోజుకు పెరిగిపోతోంది. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. తమ ఫంక్షన్లను ఫాంహౌస్‌లలో నిర్వహించురకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, రేకుర్తి, చింతకుంట, కమాన్‌పూర్‌తోపాటు కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు సమీపంలో ఫాంహౌస్‌లు నిర్మించారు. ఆహ్లాదకర వాతావరణం, ఆత్మీయుల మధ్య పార్టీలను ఫాంహౌస్‌లలో చేసుకోవాడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు.

● అత్యాధునిక వసతులు

ఫాంహౌస్‌ల్లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. ఏసీ రూంలు, వైఫై సదుపాయం, వాష్ రూంల్లో గీజర్ ఏర్పాటు చేస్తున్నారు. సూట్ రూంలు అందుబాటులో ఉంటున్నాయి. ఆహ్లాదకరమైన గార్డెనింగ్, పెళ్లికి కావాల్సిన సంప్రదాయ వస్తువులు, సంగీత్ కార్యక్రమానికి అవసరమైన వసతులతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిల్లో వాడే వస్తువులు, ఎడ్లబండ్లు, చేద బావితో పాటు అన్ని వస్తువులను ఫాంహౌస్‌లలో సమకూరుస్తున్నారు. రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, కిచన్‌తోపాటు, ప్రైవేట్ కిచెన్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. ఫ్యామిలీలు ఉండడానికి వసతి సదుపాయం, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్, నైట్‌ఫైర్, ప్రొజెక్టర్, ఫొటో షూట్ కోసం అనువైన వాతావరణాన్ని సమకూరుస్తున్నారు. అన్ని ఫాంహౌస్‌లలో వాహనాలు పార్కింగ్ చేయడానికి ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.



ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన రెయిన్‌బాత్ స్టేజి, ఈఫిల్ టవర్ నమూనా

● అన్ని రకాల ఈవెంట్స్‌కు అనుకూలం

ఫాంహౌస్‌ల్లో అన్నిరకాల ఈవెంట్స్ చేసుకోవడానికి వసతులు కల్పిస్తున్నారు. పెళ్లికి ముందు సంగీత్, హల్దీ వేడుకలు, బ్రైడ్‌గ్రూమ్ సెర్మన్, డెస్టినేషన్ వెడ్డింగ్, రిసెప్షన్ పార్టీలు, ఫ్యామిలీ ఔటింగ్‌లు, గెట్ టు గెదర్‌లు, బర్త్ డే పార్టీలు, రిటైర్‌మెంట్ ఫంక్షన్స్, బ్యాచ్‌లర్ పార్టీస్, సర్‌ప్రైస్ పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్స్, కిట్టీ పార్టీలు, ఫొటో షూట్‌లు మొదలుకొని ఆత్మీయ సమ్మేళనాలు ఇలా ఏ సెలబ్రేషన్స్ అయినా ఫాంహౌస్‌లలో నిర్వహించుకోవచ్చు.

● అందుబాటులో ధరలు

ఫాంహౌస్‌లలో చిన్న కార్యక్రమాలతోపాటు పెద్ద పార్టీలు నిర్వహించడానికి ధరలు అందుబాటులో ఉండడంతో ఈవెంట్స్ చేసుకోవడానికి నగరవాసులు ఇష్టపడుతున్నారు. ఫాంహౌస్‌లో ఉన్న వసతులను బట్టి ఎనిమిది వేల రూపాయల నుంచి ఇరవైవేల రూపాయల వరకు ధరలు నిర్ణయించారు. పది మంది సభ్యుల నుంచి మొదలుకుని వందల సంఖ్యలో కార్య క్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫాంహౌస్‌ల్లో వసతులు కల్పించారు. కొన్ని ఫాంహౌస్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా బ్యాక్‌అప్ సదుపాయం కూడా కల్పించారు.



మల్కాపూర్‌లోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన ఊయల

● అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..



అన్ని ఫంక్షన్లకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తు న్నాం. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందుబాటు ధరలోనే ఫాం హౌస్ లభిస్తుండడంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

- శ్రవణ్, ఆర్‌కే రిసార్ట్స్ యజమాని





ఫాంహౌస్‌లో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లు

4 నుంచి ఎంఎడ్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నవంబరు4 నుంచి, రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ www satavahana.ac.inలో సందర్శించాలని సూచించారు.

●ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా శాతవాహన యూనివర్సిటీ చేపట్టబోయే రెండో కాన్వకేషన్‌కు ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను కోరగా ఆయన సానుకులంగా స్పందించారని వీసీ ఉమేశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని గవర్నర్ సూచించారన్నారు.

ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని 12 మందిని మోసం చేసిన కముటం మౌనిక, కందుకూరి శ్రీధర్‌చారిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం సదాశివపల్లి గ్రామానికి చెందిన మౌనిక భర్తతో విడిపోయి కరీంనగర్‌లో ఉంటోంది. ఇదే సమయంలో శ్రీధర్‌చారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి మౌనిక తల్లిగారి గ్రామమైన పెద్దలింగాపూర్‌కు చేరుకొని శ్రీధర్‌ను బ్యాంకు అధికారిగా పరిచయం చేసింది. కేంద్రప్రభుత్వ పథకం ముద్ర యోజన కింద ఒక్కొక్కరికి రూ.10లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మబలికింది. పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట, లక్ష్మీపూర్, కొడిముంజ గ్రామాలకు చెందిన 12 మంది దగ్గర నుంచి రూ 3.45లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండారి శంకర్ ఫిర్యాదు మేరకు బుధవారం ఇద్దరిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పాలకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం గ్రామ శివారులో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. కేశోరాం సిమెంటు కర్మాగారంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న సందవెన గట్టయ్య (54) బసంత్‌నగర్ నుంచి తన స్వగ్రామమైన గోపాల్‌రావుపేటకు వెళుతండగా మార్గమధ్యంలోని జయ్యారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీఐఈవో



-క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. మధుజాన్సన్, ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, అడిషనల్ ఎస్పీ, రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్ అచ్చేశ్వర్‌రావు, టిజిఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, సరిత, సుజాత, శివ, అనూప్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో మగ బిడ్డకు జన్మనిచ్చిన ప్రయాణికురాలు



ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

అంతర్గాం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎక్స్‌ప్రెస్(ఢిల్లీ-సికింద్రాబాద్)లో ఆగ్రా నుంచి కరీంనగర్ వెళ్తున్న సోమ స్వాతి బుధవారం రైలులోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. రైలు మందమర్రి వరకు రాగానే స్వాతికి పురిటి నొప్పులు రావడంతో స్పందించిన రైల్వే టీసీ 108 సిబ్బందికి సమాచారం అందించారు. రైలు రామగుండం చేరేలోగా 108 సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే స్వాతి ప్రసవం కావడంతో 108సిబ్బంది గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సీసీఐ బోణీ

- మొదటి రోజు 11.70క్వింటాళ్లు కొనుగోలు
- మద్దతు ధర రూ.7,270గా నిర్ణయించిన అధికారులు



మార్కెట్ యార్డులో పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) బుధవారం బోణి కొట్టింది. వరంగల్ జేడీఎమ్ వి శ్రీనివాస్, డీడీఎమ్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆర్డీవో రమేష్‌బాబు, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్లా రవీందర్‌రెడ్డి 11.70క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చాడు. సీసీఐ అధికారులు పరిశీలించగా 19శాతం తేమ వచ్చింది. తేమ ఎక్కువగా ఉన్నప్పటికి నాణ్యత బాగుండటంతో మార్కెటింగ్‌శాఖ అధికారుల వినతి మేరకు సీసీఐ రూ.7270.37మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. కాని సదరు రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో అతడి సమీప బంధువు అయిన వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వంగల వెంకట్‌రెడ్డి పేరిటా విక్రయించాడు. ఈ సందర్భంగా డిడిఎమ్ పద్మావతి మాట్లాడుతూ నాణ్యమైన పత్తి విక్రయానికి తీసుకు వచ్చి ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 పొందాలని రైతులకు సూచించారు. 8నుండి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకోని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారి పాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్ ప్రతులను వెంట తీసుకు రావాలన్నారు. దళారులు, మధ్యవర్తులను నమ్మి రైతులు మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోని మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ద్వితీయశ్రేణి కార్యదర్శి ఎస్ రాజా, అడ్తీదారులు రైతులు పాల్గొన్నారు.

ఒగ్గు కళ నుంచి సినీ రంగం వైపు..

- వరుస అవకాశాలతో రాణిస్తున్న మల్లేశం
- బ్రహ్మచారి సినిమాతో హీరోగా గుర్తింపు



మహిళ వేషధారణలో మల్లేశం

"కళారంగంపై ఉన్న ఆసక్తి ఆ యువకుడిని టాలీవుడ్ వైపు తీసుకెళ్లింది.. మొదట ఒగ్గు కళాకారుడిగా ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను కట్టిపడేసేవాడు. ఎక్కడ ప్రదర్శన ఇచ్చిన వందల సంఖ్యలో గుమిగూడేవారు. ఒగ్గుకథకుడిగా ప్రత్యేక గుర్తింపు రావడం, నటనపై ఉన్న ఇష్టంతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. వివిధ షార్ట్ ఫిలింలు రూపొందించి అప్‌లోడ్ చేశాడు. అవి సినీ పెద్దల దృష్టిలో పడడంతో సినీ రంగంలో అవకాశాలు వచ్చాయి. వివిధ ప్రాతలు పోషిస్తూ మంచి నటుడిగా గుర్తింపు పొందాడు."



షార్ట్ ఫిలింలో గొర్రెల కాపరి గెటప్‌లో గుంట మల్లేశం



బ్రహ్మచారి సినిమా పోస్టర్‌లో గుంట మల్లేశం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గుంట మల్లేశంకు చిన్న తనం నుంచి కళారంగం అంటే ఇష్టం. కులవృత్తిలో భాగం గా తన తండ్రి ఒగ్గు కథలు చెబుతుండడం గమనించేవాడు. తండ్రి వద్ద ఒగ్గు కథలు చెప్పడం నేర్చు కున్నాడు. భావయుక్తంగా కథలు అల్లుతూ ప్రేక్షకు లను కట్టిపడేసేవాడు. ఒగ్గు కథల్లో ఆడ వేశధారణ మల్లేశంకు కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఇలా ఒగ్గుకథలతో రాణిస్తున్న మల్లేశంకు షార్ట్ ఫిలిమ్స్ తీయాలనే ఆలోచన వచ్చింది. జీఎం ఫోక్స్ పేరిట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. చిన్న చిన్న కథలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. ప్రేక్షకుల మంచి ఆదరణ లభించింది. దీంతో 500కు పైగా షార్ట్ ఫిలింస్, 100కు పైగా ఫోక్ సాంగ్స్ చేశాడు. యూట్యూబ్ ద్వారా మల్లేశంకు సినిమా ల్లో అవకాశం లంబించింది. మందుగా 'సైన్యం' సిని మాలో రాజకీయ నాయకుడి కార్యకర్తగా సైడ్ క్యారె క్టర్‌గా చేశాడు. వరుసగా 'సైదులు, బద్మాష్' సిని మాల్లో పలు పాత్రల్లో నటించాడు. అనంతరం 'బ్రహ్మచారి' అనే కామెడీ సినిమాలో హీరోగా అవకాశం లభించింది.



హీరో సుమన్‌తో గుంట మల్లేశం

బ్రహ్మచారి సినిమాకు అవార్డు

బ్రహ్మచారి సినిమాను తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నంది అవార్డుకు ఎంపిక చేశారు. బ్రహ్మచారి సినిమాకు మొదటి షోతోనే మంచి పబ్లిక్ టాక్ వచ్చింది. దీంతో వరసగా మల్లే శంకు అవకాశాలు వస్తున్నాయి. 'రాజుగాడు రాజైతే, శివశంభో' సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నా డు. త్వరలో తీయబోయే 'బ్రహ్మచారి-2' సినిమాలో నటించనున్నాడు.

న్యూస్ బాక్స్

స్నేహితురాలికి ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న చిన్ననాటి స్నేహితురాలికి గోదావరిఖని శ్రీరామ విద్యాలయం 2000 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆర్థికసాయం అందించారు. కుక్క సరిత భర్త సురేష్ ఇటీవల గుండెపోటుతో మరణించగా బుధవారం రూ.30వేలు ఆర్థిక సహాయం అందించారు. సరిత మిత్రులు వివిధ ప్రాంతాల నుంచి సరితకు ఆర్థిక సహాయం అందజేశారు. కాగా సరిత భర్త మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ కేసీ జైన్ మృతి

పాలకుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని బసంత్‌నగర్ కేశోరాం ప్రెసెడెంట్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన కేసి జైన్ బుధవారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన ఈప్రాంత ప్రభావిత గ్రామాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడుతున్నారు.

నిధుల మంజూరుపై సంబరాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని వెన్నంపల్లి గ్రామ రెండు వరుసల రహదారి రింగ్ రోడ్డుకు ఎమ్మెల్యే విజయరమణారావు రూ.7కోట్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఆధ్వర్యంలో స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్‌పీటీసీ లంక సదయ్య, నాయకులు కలవేన రమేష్, పనాస మల్లయ్య, వెల్తూరి రమేష్, కారుకూరి శంకరయ్య పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

మంథని, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి సూచించారు. ఇందిరా శక్తి పథకంలో భాగంగా ఉమామహేశ్వర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టైలరింగ్, మ్యాచింగ్ సెంటర్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై వినతి

మంథని, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మంథని నియోజకవర్గంలో మత్స్యకారులకు సమస్యల పరిష్కారం కోసం మంత్రి శ్రీధర్ బాబు వినతిపత్రం ఇచ్చినట్లు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ పోతరవేన క్రాంతి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి మత్స్యకారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి వినతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని, మినీట్యాంక్ బండ్, ఎల్లమ్మ చెరువు వద్దగల, కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే, నిధులు మంజూరుచేసి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. బొడ్డుపల్లి శ్రీనివాస్, గందు రంగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, భూతగడ్డ సంపత్, పోతని పురుషోత్తం, దొడ్డుపల్లి జగదీష్, చంద్రగిరి రవి, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్ రాజయ్య, నూగిల్ల మల్లయ్య, తాడూరి శ్రీమన్, శ్రీకాంత్, బొడ్డుపల్లి అశోక్ పాల్గొన్నారు

ప్రజలు నేరుగా కలిసేందుకు రోజుకు 2 గంటలు..

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి : ప్రజా సమస్యలపై ఎలా స్పందిస్తారు?

కలెక్టర్ : వివిధ శాఖల పని తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఎక్కువగా క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళతాను. సమీక్షా సమావేశాల నిర్వహణ కంటే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అందుకే వారంలో ఆరు రోజుల పర్యటన వివరాల షెడ్యూల్‌ను ముందే ప్రిపేర్ చేస్తాం. మండల, పట్టణ పరిధిలోని కార్యాలయాల తనిఖీకి వెళ్లినప్పుడు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు తారస పడతారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాను. ఒక్క ప్రజావాణికి రావడమే గాకుండా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎవరైనా నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి తనను కలిసే అవకాశం కల్పించాను.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారా?

కలెక్టర్ : జిల్లాలో గల ప్రభుత్వ ఆసుపత్రులను తరచూగా సందర్శించి అక్కడికి వచ్చే రోగులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకోవడంతో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పెద్దపల్లి, రామగుండం ఆసుపత్రుల్లో గర్భిణీ స్త్రీల ప్రసవాల సంఖ్య పెంచాం. పెద్దపల్లి ఆసుపత్రిలో పేయింగ్ రూములు ఏర్పాటుచేశాం. రామగుండం ఆసుపత్రిలో 14 పేయింగ్ రూములను ఏర్పాటు చేస్తున్నాం. సర్జికల్ రూమ్, డెలివరీ టేబుళ్లు, డాక్టర్ల సంఖ్యను పెంచుతున్నాం. రోగులకు వివిధ రకాలపరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన పరికరాలు, యంత్రాల కొనుగోలు కోసం 10 నుంచి 14 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం..

ఆంధ్రజ్యోతి : రామగుండం మెడికల్ కళాశాలలో పీజీ కోర్సులు ప్రారంభమెప్పుడు?

కలెక్టర్ : రామగుండం మెడికల్ కళాశాల ఆరంభమై మూడేళ్లు గడుస్తున్నది. ఇక్కడ ఆర్థో, గైనాకాలజీ, బయోకెమిస్ట్రీ, ఎమెర్జెన్సీ మెడికల్ కేర్ కోర్సుల్లో 16 సీట్లకు అనుమతిఇవ్వాలని మెడికల్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేశాం. ఇందుకు 25 లక్షల రూపాయల రుసుం కూడా చెల్లించాం. ఎంసీఐ అధికారులు కళాశాలను సందర్శించి ఇక్క డ వసతులను పరిశీలించిన తర్వాత అనుమతిస్తే కోర్సులను ఆరంభిస్తాం. వచ్చే ఏడాది వరకైనా అనుమతులు రావచ్చు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు చర్యలు చేపట్టారా?

కలెక్టర్ : జిల్లాలో 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 80 శాతం సన్న రకం ధాన్యాన్ని రైతులు సాగు చేశారు. సన్న రకాలను గుర్తించేందుకు ఒక్కో కేంద్రానికి కాలీపర్స్ పరికరాలను తెప్పిస్తున్నాం. దొడ్డు రకం, సన్నరకం బ్యాగులను గుర్తించేందుకు వేర్వేరు రంగుల ధారాలతో కుట్లు వేస్తారు. సన్న రకం ధాన్యం గుర్తించడంలో ఇబ్బందులు తలెత్తితే జిల్లాస్థాయిలో ఏడీఏ, ఆర్‌డీఓ నేతృత్వంలో ఏర్పాటు చేసిన అప్పీల్ కమిటీని సంప్రదించాలి. కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాం. ఆయా ప్రాంతాల్లో వరి కోతలను బట్టి కేంద్రాలను ఆరంభిస్తున్నాం. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కేంద్రాలకు ధాన్యాన్ని తీసుక రావాలి.

ఆంధ్రజ్యోతి : నేషనల్ హైవే రోడ్డుకు భూసేకరణ ఎలా సాగుతున్నది?

కలెక్టర్ : మంచిర్యాల-వరంగల్ నేషనల్ హైవే జిల్లా పరిధిలో 38కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇందుకు మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో 204 హెక్టార్లలో భూమి అవసరం. 85శాతం సేకరణ పూర్తయ్యింది. రైతులకు 32 కోట్ల రూపాయల వరకు పరిహారం చెల్లించాం. పరిహారం ఎకరానికి 20లక్షలకు పెరిగినందున ఆ డబ్బులు కూడా త్వరలోనే మంజూరు కానున్నాయి. మిగతా భూముల సేకరణ పూర్తి చేస్తాం. వరి కోతలు అయిన తర్వాత నవంబర్ 6 నుంచి హైవే రోడ్ పనులు ఆరంభం కానున్నాయి.

ఆంధ్రజ్యోతి : యాష్ పాండ్ భూసేకరణ ఎక్కడ వరకు వచ్చింది?

కలెక్టర్ : టీఎస్‌టీపీపీ ప్రాజెక్టు యాష్ పాండ్ కోసం అంతర్గాం మండలం మొఘల్ పహాడ్‌లో 606 ఎకరాల భూములు గుర్తించాం. ఇందులో అత్యధికంగా ప్రభుత్వ భూములే ఉన్నాయి. దాదాపు 250 ఎకరాల భూములను తాము దున్నుకుని జీవిస్తున్నామని తమకు పరిహారం ఇవ్వాలని నోటీసులు పంపించారు. భూ సేకరణకు ముందు 60 ఎకరాల వరకే సాగులో ఉన్నాయని గుర్తించాం. డ్రోన్ కెమెరాలతో కూడా ఎన్ని ఎకరాల్లో భూములు సాగవుతున్నాయని రికార్డు చేశాం. నోటీస్ పీరియడ్ ముగిసిన తర్వాత అవార్డు ప్రకటిస్తాం.

ఆంధ్రజ్యోతి : పెద్దపల్లి బస్ డిపోకు భూకేటాయింపులు జరిగాయా?

కలెక్టర్ : బస్టాండ్ సమీపంలోని ఎంపీడీవో, పంచాయతీరాజ్ కార్యాలయాలు, సివిల్ సప్లయ్ గోదాముల స్థలం 4.31 ఎకరాలు కేటాయించాం. ఈ సమాచారాన్ని ఆర్టీసీ అధికారులకు చేరవేశాం. నిర్ణీత రుసుం ప్రభుత్వానికి చెల్లించిన తర్వాత ఆ స్థలాన్ని తెలంగాణ ఆర్టీసీకి కేటాయిస్తాం. అందులో ఉన్న కార్యాలయాలను కొన్నింటిని కలెక్టరేట్‌కు, మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణకు తరలిస్తాం.

ఆంధ్రజ్యోతి : జిల్లా ప్రజలు ఎలా ఉన్నారు? రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా?

కలెక్టర్ : నేను ఇక్కడకు వచ్చి నాలుగు మాసాలయ్యింది. ఈ జిల్లా ప్రజలు చైతన్యవంతులు. కష్టజీవులు. వారి సమస్యలను నేరుగా చెప్పుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. అవినీతికి తావు లేకుండా జిల్లా ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే నా ధ్యేయం. పరిపాలనా పరంగా నాపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లలేవు. అందరిని సమన్వయం చేసుకుని ముందుకు వెళుతున్నాను. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తాను.

రామగుండంలో రోడ్ల విస్తరణ ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

లక్ష్మీనగర్-కళ్యాణ్‌నగర్-మార్కెట్ రోడ్‌ల మధ్య లింకు పెరుగుతుంది.

● మార్కింగ్‌లపై గందరగోళం

రామగుండం నగరపాలక సంస్థ గోదావరిఖని పట్టణంలో మూడు రహదారుల విస్తరణకు మార్కింగ్ ఇచ్చింది. కొన్నిచోట్ల మార్కింగ్ ఇవ్వడంలో ప్రామాణికంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. రహదారి విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లోని నిర్మాణాలు జనగామ గ్రామ పంచాయతీ, నోటిఫైడ్ ఏరియా సమయంలో జరిగినవే. 90 శాతం నిర్మాణాలకు భవన నిర్మాణ అనుమతులు కూడా ఉన్నాయి. పలు భవనాలు ఇటీవల కాలంలో నిర్మించగా నిబంధనల మేరకు సెట్ బ్యాక్ అయ్యేవి కూడా ఉన్నాయి. కార్పొరేషన్ పెట్టిన మార్కింగ్‌లో తేడాలున్నాయి. ముఖ్యంగా లక్ష్మీనగర్‌లో అజయ్ మెడికల్ స్టోర్ నుంచి పాపులర్ షూమార్ట్ రహదారిలో ఒక భవనానికి ఆరు అడుగులు, మరో భవనానికి 10అడుగుల విస్తరణ మార్కింగ్ పెట్టారు. ఈ రెండు పాత భవనాలే. అలాగే గణేష్‌నగర్ బోర్డు నుంచి విజయ హాస్పిటల్ రహదారిలో కూడా కొత్త నిర్మించిన సెట్ బ్యాక్ భవనాలకు, పాత భవనాలకు ఒకే రీతిలో మార్కింగ్ పెట్టారనే ఇంటి యజమానులు ఆరా తీస్తున్నారు. 30అడుగుల రహదారి సెట్ బ్యాక్ అయి నిర్మించామని, మళ్లీ మార్కింగ్ పెట్టడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా రోడ్డు విస్తరణ మార్కింగ్ చేసే సమయంలో రోడ్డు సెంటర్‌గా తీసుకుని ఇరువైపులా మార్కింగ్ ఇస్తారు. రామగుండం నగరపాలక సంస్థ రోడ్ల విస్తరణ, ఆక్రమణ తొలగింపు తదితర పనుల కోసం యంత్రాలు, మెటీరియల్ తరలించే ట్రాక్టర్లు, ఇతర సామగ్రి మ్యాన్‌పవర్‌కు సంబంధించి ఖర్చు కూడా తడిసి మోపడవుతుంది. ఇప్పటి వరకు ఓచర్ బిల్లులపై పేమెంట్ చేస్తున్నారు. ఇందులో పారదర్శకత ఉండే అవకాశం లేకపోవడంతో అంచనాలు రూపొందించి రూ.10లక్షలతో టెండర్‌కు ప్రతిపాదించారు.

● రోడ్ల విస్తరణ జరిగితేనే పనులు

టీయూఎఫ్ఐడీసీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధులతో రామగుండంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ముఖ్యంగా వ్యాపార కేంద్రాల్లోనే మౌలిక సదుపాయలకు రూ.35 కోట్లు కేటాయించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో రోడ్ల విస్తరణ ప్రక్రియ జరిగితేనే అభివృద్ధి పనులు ముందుకు పోనున్నాయి.

భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఉచిత శిక్షణ

మార్కండేయకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణశాఖ సంయుక్త భాగస్వామ్యంతో లేబర్ కార్డు కలిగిన కార్మికుల పిల్లలకు ఎలక్ట్రీషియన్ హౌస్ వైరింగ్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటు స్టేషనరీ, యూనిఫాం కూడా అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్లేస్‌మెంట్ కూడా ఇప్పిస్తామన్నారు. శిక్షణ పొందాలనుకునే వారు ఎస్ఎస్‌సీ, ఆధార్, బ్యాంకు ఖాతా, తల్లిదండ్రుల లేబర్ కార్డుతో గోదావరిఖని గంగానగర్‌లోని న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌ను సంప్రదించాలని జిల్లా సహాయ సంచాలకులు గోలి రమేష్ పేర్కొన్నారు. దరఖాస్తులకు ఈనెల 30 చివరి తేది అని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కోల్‌సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు అసిస్టెంట్ కమిషనర్ రాజును కోరారు. ఈ మేరకు బుధవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, 8గంటల పని విధానం అమలు చేయాలని, అర్హతను బట్టి డ్రైవర్లుగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు ఇవ్వాలని, రూ.25లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ నెల 25న చలో సీడీఎంఏ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, కిషన్‌నాయక్, సారయ్య, శోభ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రహదారులకు మహర్దశ

ఎలిగేడు, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రహదారులకు మహర్దశ చేకూరిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఎలిగేడు, లాలపల్లి గ్రామాల్లో బీరన్న టెంపుల్ ప్రహరీగోడ, సిమెంట్‌రోడ్డు నిర్మాణాలకు రూ.కోట్ల 50లక్షల వివిధ పథకాల కింద నిధులు మంజూరు కాగా వాటి నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం, అశ్రద్ధ మూలంగా అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఎలిగేడు పోలీస్‌స్టేషన్ మంజూరుకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉంచామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బుద్ధినేని వామన్‌రావు, బూర్ల వెంకటసత్యం, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మండిగ రాజనర్సు, తాటిపల్లి రమేష్‌బాబు, బాలసాని పర్శంగౌడ్, గొల్లె భూమేష్, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, తదితర గ్రామాల కార్యకర్తల పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పోలీసుల విధులు, పనితీరుపై అవగాహన కల్పించారు.

● ఫైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో స్పందన మోడల్ స్కూల్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ప్రసాదరావు, ఎస్సైలు వెంకటకృష్ణ, సోనియ, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి) : బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ ఆర్ స్వామి విద్యార్థులకు ఆయుధాల గురించి వివరించారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్‌లో భాగంగా ఆయుదాలపై ఎస్సై అశోక్ రెడ్డి అవగాహన కల్పించారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేష్ బుధవారం ఓపెన్ హౌస్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

● రామగిరి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దనిమంథని సీఐ రాజు అన్నారు. మండలంలోని కల్వచర్లలో ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్‌లో మంథని సీఐ రాజు ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. సక్రమంగా ధృవ పత్రాలు లేని సుమారు 30 ద్విచక్రవాహనలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తారం, మంథని ఎస్ఐలు పాల్గోన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అంతర్గాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ ముందుకు సాగుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. బుధవారం రామగుండం పట్టణంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఈ మేరకు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలుచేస్తోందన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేసేందుకు రుడా ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీందర్, జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్, మేయర్ అనిల్ కుమార్, ఏసీపీ రమేష్, సీఐ ప్రవీణ్ కుమార్, సబ్ రిజిస్టర్ బదావత్ తిరుపతి, కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, బుగ్గ రాములుగౌడ్, సింగం కిరణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

రాజాపూర్, బుధవారంపేట్ గ్రామాల్లో సర్వే పూర్తి : కలెక్టర్

రామగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజాపూర్, బుధవారంపేట్ గ్రామాల్లోని 700 ఎకరాలకు సంబంధించిన ఎంజాయిమెంట్ సర్వేను పూర్తి చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం మండలంలోని రాజాపూర్, బుధవారంపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. రెవెన్యూ రికార్డులు సరి చేయడానికి గ్రామాల్లో పూర్తి చేసిన ఎంజాయిమెంట్ సర్వే పై రైతుల్లో అభ్యంతరాలు ఉన్నా ఎడల దరఖాస్తు చేసుకొవాలని కలెక్టర్ సూచించారు. రైతుల అంగీకారంతో సర్వే నివేదిక ఆధారంగా పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు జారీ చేయాలని ఆర్‌డీవో, తహసీల్దార్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో గంగయ్య, రామగిరి తహసీల్దార్ రాంచందర్‌రావు, అధికారులు పాల్గోన్నారు. కాగా, మండలంలోని బేగంపేట్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో స్కావెంజర్‌ను ఏర్పాటు చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మన ఊరు- మన బడి కార్యక్రమం కింద నిర్మాణం చేపట్టిన డైనింగ్ హల్ వినియోగించుకోకపోవడంపై ఆరా తీశారు. విద్యుత్, ఫ్యాన్‌ల ఏర్పాటు లేని కారణంగా వినియోగంలో లేదని తెలపడంతో తక్షణం విద్యుత్ సౌకర్యాం ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఎల్. మేరీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



పదోన్నతులు కల్పించాలని ఈపీ ఆపరేటర్ల వినతి



వినతిపత్రం అందిస్తున్న ఈపీ ఆపరేటర్లు

రామగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఆర్జీ-3 డివిజన్‌లో పనిచేసే 2017 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఈపీ ఆపరేటర్స్ తమకు ప్రమోషన్స్ కల్పించేందుకు కృషి చేయాలని కోరుతూ బుధవారం సెంటినరీకాలనీ ఖేల్‌మహేంద్ర భవనలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవిరావు, సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్, బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డిలకు ఆపరేటర్స్ వినతిపత్రం అందజేశారు. దీనిపై ట్రేడ్ యూనియన్ నాయకులు సానుకూలంగా స్పందించి త్వరలోనే ప్రమోషన్స్ ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనింగ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, నాయకులు మొండయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కమిటీ సభ్యుడిగా రామారావు

రామగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌కు జీఎం కమిటీ సభ్యుడిగా ఓసీపీ-2 సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఎల్లంకి రామారావు ఎంపికయ్యారు. ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించిన రామారావును ఎంపిక చేస్తూ యూనియన్ జనరల్ సెక్రెటరీ జనక్‌ప్రసాద్ ఆదేశాల మేరకు ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డిలు ఎంపిక చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

హెచ్ఎంఎస్‌లో నియామకాలు

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొంత మంది నాయకులను ఏరియా కమిటీలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏరియా జాయింట్‌ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సదిరం రాజేంద్రప్రసాద్, బొడ్డు సురేందర్ నియామకమయ్యారు. ఆర్‌కే7పిట్ కార్యదర్శిగా చెవుల శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా మీసాల మహేందర్, ఆర్‌కే న్యూటెక్ పిట్ కార్యదర్శి తుల అనిల్‌ను నియమించారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా స్థాయిలో రాణించాలి..

- కంపెనీ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం



కబడ్డీ పోటీలో తలపడుతున్న జట్లు

గోదావరిఖని, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): కోలిండియా స్థాయిలో సింగరేణి క్రీడాకారులు రాణించాలని ఆర్జీ-1 డి.లలిత్‌కుమార్ ఆకాంక్షించారు. గత రెండురోజులుగా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న కంపెనీస్థాయి కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ 2024-25 వార్షిక క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని మెలకువలతో ఆటలు ఆడాలన్నారు. అప్పుడే విజయం సాధించడం జరుగుతుందన్నారు. క్రీడలు జీవితంలో ఎదుగుదలకు ఆత్మస్థైర్యానికి దోహదపడతాయని క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ముందుకు సాగాలన్నారు. కంపెనీ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను కోలిండియాలో జరిగే పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. కోలిండియాలో ప్రతిభ కనబర్చి సింగరేణి సంస్థ ఘనతను మరోమారు చాటిచెప్పాలన్నారు. పోటీల్లో గెలిచిన జట్లకు జీఎం లలిత్‌కుమార్‌తో పాటు ఖని ఏసీపీ రమేష్ బహుమతులు అందజేశారు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి జట్టు ప్రథమ స్థానంలో, శ్రీరాంపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు కే స్వామి, అధికారుల సంఘం ప్రతినిధి క్రాంతి, ఎస్వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు తోపాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 టెండర్ల గోల్‌మాల్ పై విజిలెన్స్ విచారణ

రామగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3లో అద్దె ప్రాతిపదికన వాహనం పెట్టుకోవడానికి భూనిర్వాసితుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసే వ్యవహారంలో గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలపై బుధవారం విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అందులో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి వాంగ్మూలం తీసుకున్న అధికారులు అనంతరం డివిజన్‌కు చెందిన పర్చేజ్ అధికారి నాగేశ్వర్‌రావును విచారించి రికార్డులు పరిశీలించారు. కాగా, టెండర్ల గోల్‌మాల్‌పై బాధితులు విజిలెన్స్‌కు, సీఎండీకి ఫిర్యాదు చేయడంతో అక్రమంగా అనుమతిచ్చిన వాహన కాంట్రాక్ట్ రద్దు చేస్తున్నట్లు నోటీసు జారీ చేయడం గమనార్హం.

ధాన్యంలో కోత విధిస్తే క్షమించేది లేదు

- ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆర్థికంగా కష్టాలకోర్చి పండించిన ధాన్యంలో మిల్లర్లు గాని కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గాని ధాన్యంలో కోత విధిస్తే ఎట్టి పరిస్థితుల్లో క్షమించేది లేదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని గుంపుల, రూపునారాయణపేట, పొత్కపల్లి, ఓదెలలో వ్యవసాయ సహకార సంఘం, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఓదెలలో మాట్లాడుతూ, దాన్య కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే రైతులకు ట్రక్ షీట్స్ వెంటనే ఇవ్వాలని,అలాగే మిల్లుల్లో ధాన్యం దిగుమతి అయ్యేవరకు కేంద్రాల నిర్వహకులదే బాధ్యత ఉంటుందని, తూకం అయిన తర్వాత రైతులకు ధాన్యం కేంద్రాలతో ఎలాంటి సంబంధం ఉండదని, రైతులను బాధ్యులను చేయవద్దని తెలిపారు. ధాన్యం బిల్లులకు తరలించిన తర్వాత మిల్లుల వద్దకు రైతులను తీసుకువెళ్ళవద్దని అన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతను పాటించాలని, కేంద్రాల నిర్వాహకులతో సమన్వయంగా వ్యవహరించాలని కోరారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే స్వయంగా నేనే ముందుండి మిల్లుల వద్ద ధాన్యాన్ని దింపిస్తానని భరోసా ఇచ్చారు. సన్న రకాల ధాన్యానికి రూ.ఐదు వందల బోనస్ ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని తెలిపారు. మండలంలోని అన్ని ధాన్య కొనుగోలు కేంద్రాలను ప్రతివారం సందర్శించి తనిఖీలు నిర్వహించాలని తహసీల్దార్ యాకయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే గత ప్రభుత్వంలో ప్రతి క్వింటాల్ ధాన్యంలో 20కిలోల చొప్పున ధాన్యాన్ని దోచుకోని కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారని, ఇప్పుడు గింజ కూడా వృధా కావడానికి వీలులేదని, రైతులు పండించిన ధాన్యా ఫలితాలు రైతులే అనుభవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, నాయకులు తిప్పారపు సంపత్, సంద మహేందర్, గిరాం సాంబమూర్తి, పడాల రాజు, సిరిసేటి రాహుల్, చీకట్ల మొండయ్య, అంకం రమేష్, ఆకుల మహేందర్, బోడకుంట శంకర్, చింతం కుమారస్వామి, నాగపూరి రవి గౌడ్, బోడకుంట స్వామి, కోట నిరంజన్ రెడ్డి, చొప్పరి రాజయ్య, రెడ్డి రజనీకాంత్, బొంగోని శ్రీనివాస్, నీర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో...

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో కూడా ధాన్యం కొనుగోళ్లలో అదనపు కటింగ్‌లో కోతలు ఉండవని రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం కటింగ్ అనే పదానికి తావు లేదని స్పష్టం చేశారు. సన్నరకం వడ్లకు ఐదు వందల బోనస్ ఇస్తారని, ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని రైతులకు సూచించారు. వచ్చే యాసంగి నుంచి రైతు భరోస ద్వారా క్వింటాలుకు ఏడు వేల ఐదు వందలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మినుపాల ప్రకాష్ రావు రాజలింగం, ఉస్సెం గణేష్, ఎండీ అమీనొద్దిన్, ఏఓ డేవిడ్, సీఈఓ బూరుగు సంతోష్ డైరక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ సందర్శిణి కార్యక్రమంలో భాగంగా గురువారం వివేకానంద విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థుల బృందం మండలంలోని నారాయణరావుపల్లిని సందర్శించింది. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులపై విద్యార్థులు సర్వే చేశారు. పేదలను గుర్తించి వారికి స్కూల్ యాజమాన్యం తరఫున సరుకుల కిట్లను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి అంజయ్య, రాంచంద్రారెడ్డి, ఏవో సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.